సామాజిక, రాజకీయ, సినీ వారపత్రిక
చరిత్ర
నిన్న జరిగింది నేటి 'చరిత్ర' - నేడు జరిగేది రేపటి 'చరిత్ర'


# మన మాట

ప్రతి పదం ప్రజల పక్షం

TELANAGANA సంపుటి 18 సంచిక 51

S tv SANDESH
ప్రతి మాట విలువైనది - ప్రతి దృశ్యం అరుదైనది

ఆదివారం | 2 డిసెంబర్ | 2024 | పేజీలు : 6

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA





# మధుర జ్ఞాపకాల వానలో ప్రేమగా తడిసి ముద్దయ్యారు

## మధుర జ్ఞాపకాల వానలో ప్రేమగా తడిసి ముద్దయ్యారు

## పోతూ పోతూ గుండెల నిండా ఆనందపు బరువు మోసుకు పోయారు

## ఒక సంవత్సరం తక్కువ నాలుగు దశాబ్దాల తర్వాత కలిశారు





తియ్యటి జ్ఞాపకాల దొంతరలు చిందులు వేశాయి. మధురానుభూతులు నెమరు వేసుకుంటూ ఆనందపు మైకంలో మనసులు సంబురాలు చేసుకున్నాయి. దశాబ్ధాల తరబడి గుండెల్లో పదిలంగా దాచుకున్న ముచ్చట్లు..కబుర్లు అణువణువూ సంతోషంతో నింపేశాయి. కను రెప్పల మధ్య ఆనందపు భాష్పాల ముసురు పట్టి నైరుతీ రుతుపవనాల ను గుర్తుకు చేశాయి. చిరుజల్లుల్లో తడిసే పిల్లల్లా పెద్దలంతా భావోద్వేగపు బరువులు ఆనందంగా మోశారు. ఒకరినొకరు ఆలింగనాలు చేసుకుని అరేయ్ గుర్తుందా ఆ రోజుల్లో మనం ఇలా ఉండేవాళ్లం నువ్వు చేసే అల్లరిని తలచుకుని ఎప్పుడూ నవ్వుకుంటూ ఉండేవాళ్లం అంటూ మనసులు విప్పుకుని నాలుగు దశాబ్ధాల పాటుగా గుండె గదుల్లో




దాచి పెట్టుకున్న జ్ఞాపకాలన్నింటినీ తోడుకుంటూ ఆడుతూ పాడుతూ హాయిని అనుభవించారు.ఈ అద్భుత దృశ్యాలన్నింటికీ దుండిగల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేదికగా నిలిచింది.ఈ పాఠశాలలో 1985-1986 బ్యాచ్ లో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులంతా 39 సంవత్సరాల తర్వాత పాఠశాలలో కలుసుకున్నారు. పూర్వ విద్యార్ధుల ఆత్మీయ సమ్మేళనానికి అంతా తరలి వచ్చారు.అప్పట్లో చదువుల్లో సరస్వతీ పుత్రుల్లా వెలిగిన తమ స్నేహితులు ఇపుడు ఏయే రంగాల్లో ఎంత కీలక పాత్రల్లో ఉన్నారో తెలుసుకుని సంబరపడిపోయారు. కొందరు వైద్యులు, కొందరు ఇంజనీర్లు..మరి కొందరు లాయర్లు అయితే ఇంకొందరు రేపటి తరాన్ని తయారు చేసే ఉపాధ్యాయులుగా లెక్చరర్లుగా ఎదిగారు. మరి కొందరు రాజకీయాల్లో కీలక పదవులు పొందారు. అంతా కూడా ఒక్క సారి టైమ్ మెషీన్ లో ఎంటర్ అయినట్లు గతంలోకి వెళ్లిపోయారు. ఒక్కసారిగా పదో తరగతి చదివే పిల్లలైపోయారు. అప్పట్లో తమకు మంచి విద్యాబుద్ధులు నేర్పి తెలుగు, ఇంగ్లీషు భాషల్లో ప్రావీణ్యం నేర్పి తమని ప్రయోజకులుగా తీర్చిదిద్దిన గురువులను పూజించుకోవాలని అనుకున్నారు తెలుగు నేర్పిన తమకి ఎంత బాగా పాఠాలు చెప్పారో గుర్తు చేసుకున్నారు. ఆ ఉపాధ్యాయుల కు సన్మానాలుచేసి గురువుల దగ్గర ఆశీస్సులు అందుకున్నారు. ఎంత ఎదిగినా తమని గౌరవించిన పూర్వ శిష్యులను చూసి గురువులు కూడా భావోద్వేగాలకు గురయ్యారు. ఢిల్లీకి రాజైనా తల్లికి కొడుకే అన్నట్లు సమాజంలో ఎంత ఉన్నత పదవుల్లో ఉన్నా ఒకప్పుడు తమ దగ్గర పాఠాలు నేర్చుకున్నామన్న భావన పూర్వ విద్యార్థుల్లో ఇప్పటికీ ఉండటాన్ని చూసి గురువులు ఆనంద భాష్పాలు రాల్చారు. మీరు సమాజంలో మరిన్న ఉన్నత శిఖరాలు అధిరోహించండంటూ మనస్ఫూర్తిగా ఆశీర్వదిం చారు. పదో తరగతి చదివటపుడు తాము చేసిన అల్లరి పనులు..చిలిపి పనులు గుర్తు చేసుకుని పెద్దలంతా పిల్లలైపోయారు. సహచర విద్యార్థు లను ఏడిపించడానికి సరదా సరదాగా ఎలా వేళాకోళాలు ఆడుకునేవారో చెప్పుకుని కడుపు బ్బ నవ్వుకున్నారు. గంటల తరబడి కబుర్లు చెప్పుకుంటూ కాలాన్ని మర్చిపోయారు. తమ తమ కుటుంబాల గురించి పరిచయాలు చేసుకున్నారు. తమ పిల్లలు ఏమేం చదువులు చదువుతున్నారో చెప్పుకుని గర్వంగా నవ్వుకున్నారు. చూస్తూఉండగానే నాలుగైదు గంటల సమయం అయిపోవడంతో అప్పుడే అయిపోయిందా అని బాధగా నిట్టూర్చారు. మళ్లీ మనమంతా ఎప్పుడు కలుస్తామో అని బెంగ పడ్డారు. ఇపుడు అందరికీ స్మార్ట్ ఫోన్లు కూడా వచ్చాయి కాబట్టి బ్యాచ్ అంతా కలిసి ఒక వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. తర్వాతి సమ్మేళనంలో కలుసుకునే లోపు వాట్సప్ లో అనుబంధాన్ని కొనసాగించాలని అనుకున్నారు. పూర్వ విద్యార్థుల రాకతో ప్రభుత్వ పాఠశాల కూడా మురిసిపోయి మెరిసిపోయింది. తమ నాలుగు గోడల మధ్య చదువులు నేర్చి ప్రయోజకులైన వారిని చూసి పాఠశాల భవనం కూడా సంబర పడింది.పూర్వ విద్యార్థులు పోలీస్ మోహన్ రెడ్డి. నర్సారెడ్డి భూపతిరెడ్డి. రవీందర్ రెడ్డి .బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి. , విఘ్నేశ్వర్ , రవీందర్ రెడ్డి , నరేందర్ రెడ్డి , రమేష్ , శ్రీనివాస్ , వేణు , వెంకట్ రెడ్డి , వినోద , బాల లక్ష్మి ,సునీత , సారా నజీరా , నర్సిమ్మ గౌడ్ , మలేష్ , పద్మారావు , రాములు ,తదితరులు పాల్గొన్నారు.





అనిల్ కుమార్ కుంట....
SANDESH PLUS
93933 44405